ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్

మా కలం - సామాన్యుడి బలం

CELL : 9440352036

# స్వర్ణసాగరం

WWW.SWARNASAGARAM.COM


PRGI : APTEL/26/A1104

జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
9440352036

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ
సంపుటి : 1, సంచిక : 163
పేజీలు : 8
సోమవారం 24 ఆగస్టు 2026
వెల : 2-00

# తూర్పు భారతావనికి రాజమార్గం




- ఖరగ్‌పూర్‌--అమరావతి కారిడార్‌కు గ్రీన్ సిగ్నల్
- 1,107 కి.మీ. రహదారి ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌కు ఆమోదం
- ఏపీలో 457 కి.మీ... రూ.32 వేల కోట్ల అంచనా వ్యయం
- మోదీ, గడ్కరీలకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- తూర్పు భారతంతో అమరావతికి కొత్త రహదారి అనుసంధానం

**అమరావతి, స్వర్ణసాగరం**

ఆంధ్రప్రదేశ్‌ను తూర్పు భారతదేశంతో అనుసంధానించే కీలకమైన ఖరగ్‌పూర్‌–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మాణంలో మరో ముఖ్యమైన అడుగు పడింది. మొత్తం 1,107 కిలోమీటర్ల నిడివితో పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మీదుగా సాగే ఈ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌కు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ కారిడార్‌లో ఏపీ పరిధిలోనే అత్యధికంగా 457 కిలోమీటర్ల మేర రహదారి నిర్మితం కానుంది. ఎలైన్‌మెంట్‌కు ఆమోదం లభించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల తరఫున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే తూర్పు భారతదేశంతో నేరుగా అనుసంధానం ఏర్పడి, రైతులు మరియు పారిశ్రామికవేత్తలకు రవాణా, లాజిస్టిక్స్ వ్యయాలు గణనీయంగా తగ్గుతాయని సీఎం పేర్కొన్నారు. రాజధాని అమరావతి ప్రధాన ఆర్థిక కేంద్రంగా ఎదగడంతో పాటు వ్యవసాయం, వాణిజ్యం, ఉపాధి రంగాల్లో సరికొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.75 వేల కోట్లు కాగా, ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే సుమారు రూ.32 వేల కోట్లు వెచ్చించనున్నారు. ఏపీలో ఈ రహదారి పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల మీదుగా సాగుతూ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానమవుతుంది. దీనివల్ల అరకు, పాడేరు, చింతపల్లి, జంగారెడ్డిగూడెం - మిగతా3లో



# అంతరిక్ష రంగంలో అగ్రస్థానానికి భారత్

- ప్రధాని మోదీ వ్యాఖ్య
- "విస్తారమైన మన ప్రతిభావంతుల సమూహం, రిస్క్ తీసుకునే సామర్థ్యం మన బలం
- వీటితో ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ అగ్రస్థానానికి చేరుకోగలదు
- ప్రపంచం ఇప్పుడు భారతీయ స్టార్టప్‌ల వైపు ఆసక్తి చూస్తోంది.
- మరిన్ని పెద్ద కలలు కంటూ, మరింత పెద్ద ఆవిష్కరణలు చేస్తూ, సరికొత్త సరిహద్దులకు విస్తరిద్దామని పిలుపు


**స్వర్ణసాగరం న్యూఢిల్లీ**


అంతరిక్ష పరిశోధన రంగంలో ప్రైవేట్ రంగాన్ని మరింత ప్రోత్సహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆదివారం 'జాతీయ అంతరిక్ష దినోత్సవం'సందర్భంగా ప్రధాని మోదీ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని పెద్ద కలలు కంటూ, మరింత పెద్ద ఆవిష్కరణలు చేస్తూ, సరికొత్త సరిహద్దులకు విస్తరిద్దామని పిలుపునిచ్చారు. 2023 ఆగస్టు 23న విక్రమ్ ల్యాండర్‌ను చంద్రుడి ఉపరితలంపై సురక్షితంగా దించిన చంద్రయాన్–3 మిషన్‌ను స్మరించుకోవడానికి ఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 20 అంతరిక్ష రంగ అంకుర సంస్థల వ్యవస్థాపకులు, సీఈఓలతో ప్రధాని మోదీ శుక్రవారం నాటి భేటీ పూర్తి వివరాలను కేంద్ర ప్రభుత్వం ఆదివారం విడుదలచేసింది. "విస్తారమైన మన ప్రతిభావంతుల - మిగతా3లో

## డీలిమిటేషన్ బిల్లు కోసమే లోక్‌సభను ఇంకా కొనసాగిస్తున్నారా

- మోదీ సర్కార్‌పై జైరాం రమేశ్ విమర్శలు
- 'డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం అమిత్ షా 2/3 మెజారిటీ కోసం ప్రయత్నిస్తున్నారా?'
- లోక్‌సభ ప్రొరోగేషన్ ఆలస్యం వెనుక దురుద్దేశాలు ఉన్నాయా
- కేంద్రంపై జైరాం రమేశ్ ధ్వజం

2





## పరిశ్రమలకు కొత్త ఊపు

- ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా మారగల సత్తా భారత్‌కు ఉంది
- బంగాల్‌లో రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు రాజ్‌నాథ్ శంకుస్థాపన
- జీఆర్ఎస్ఈకి మూడు, యంత్ర ఇండియాకు రెండు ప్రాజెక్టులు
- కొత్త ప్రాజెక్టులతో ఉద్యోగాలు, ఎంఎస్ఎంఈలకు అవకాశాలు పెరుగుతాయి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

2



## పార్లమెంట్ సమావేశాలు ముగియలేదు, వాయిదానే వేశారు

- కీలక బిల్లు ఆమోదం కోసమేనా? తెర వెనక ఏం జరుగుతోంది?
- ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన ఉభయ సభలు
- పది రోజులు గడిచినా జారీ కాని ప్రొరోగ్ ఉత్తర్వులు
- మహిళా రిజర్వేషన్ అమలుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు చర్చ

2

# బడులు ఖాళీ అవుతున్నా బాబు అబద్ధాలు!

- 1.10 లక్షల చేరికలెక్కడ? 5.56 లక్షల మంది తగ్గడమే నిజం!
- కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ గణాంకాలే తేల్చాయి
- 2023-24లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య 40.50 లక్షలు
- 2025-26లో ఆ సంఖ్య 34.93 లక్షలకు పడిపోయింది
- మూడేళ్లలో ప్రభుత్వ బడుల్లో ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారు
- ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 45 వేల నుంచి 44,222కు తగ్గింది



**అమరావతి, స్వర్ణసాగరం**

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చివరి ఏడాది అయిన 2023--24లో పోల్చితే 2025--26లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 5.56 లక్షలు తగ్గిందని కేంద్ర విద్యా శాఖకు చెందిన యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్--యూడీఐఎస్ఈ) గణాంకాలు తేల్చిచెబుతుంటే.. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు - మిగతా3లో

## మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం!




- కేంద్రం హామీలపై సీజేపీ కీలక భేటీ
- కేంద్రం ఇచ్చిన హామీల అమలుపై సోమవారం సీజేపీ సమీక్ష
- ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, పరిహారం అంశాల్లో పురోగతి లేదని ఆరోపణ

వివరాలు 2లో..

# పరిశ్రమలకు కొత్త ఊపు

ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా మారగల సత్తా భారత్‌కు ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. నౌకా నిర్మాణ రంగంలో ఏర్పడిన అవకాశాలను భారత్ అందిపుచ్చుకోవాలని అన్నారు. బంగాల్‌లోని కోల్‌కతా నుంచి గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్‌ఎస్‌ఈ), యంత్ర ఇండియా లిమిటెడ్ విస్తరణకు సంబంధించిన రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆదివారం ఆయన వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రపంచ నౌకా నిర్మాణ రంగంలో ప్రస్తుతం ఒక రకమైన ఖాళీ ఏర్పడుతోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ అవకాశాన్ని భారత్ ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నా రు. భారత్ ప్రపంచ షిప్‌బిల్డింగ్ హబ్‌గా మారగలదని అన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టులు దోహదం చేస్తాయని చెప్పారు. దేశీయంగా యుద్ధ నౌకల తయారీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు విదేశాలపై ఆధారపడటాన్ని మరింత తగ్గించేందుకు ఇవి ఉపయోగపడతాయని వివరించారు. బంగాల్‌లో పారిశ్రామిక రంగంలో కొత్త మార్పు కనిపిస్తోం దని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గతంలో రాష్ట్రం నుంచి పరిశ్ర మల మూసివేతలు, లాకౌట్ల వార్తలు ఎక్కువగా వచ్చేవని, ఇప్పుడు కొత్త ప్రాజెక్టుల ప్రారంభ వార్తలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్త పెట్టుబడులతో పరిశ్రమలకు ఊతం లభించడంతో పాటు భారీగా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (మీవీజుం) రక్షణ ఉత్పత్తి రంగంలో భాగస్వాములు కావడానికి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.



**‘స్వావలంబనకు ఇవి కీలక అడుగులు’**

దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో రక్షణ రంగానికి కీలక స్థానం ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావించిన సప్తధార అభివృద్ధి మార్గాల్లో రక్షణ రంగం కూడా ఒకటని గుర్తుచేశారు. దేశ రక్షణ అవసరాలను సాధ్యమైనంత వరకు దేశీయంగానే తీర్చాలన్న లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ రంగ సంస్థల మౌలిక వసతులను బలోపేతం చేయడం కీలకమని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు కేవలం నేటి అవసరాల కోసం కాదని, భవిష్యత్తు కోసమని అన్నారు. సుమారు రూ.3,500 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశామని, భారత్ నిర్మాణంలో ఇవి కీలక అడుగులని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

**800కు పైగా నౌకల నిర్మాణం**

జీఆర్‌ఎస్‌ఈ పనితీరును రక్షణ మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. సంస్థ ఇప్పటివరకు 800కు పైగా నౌకలను నిర్మించిందని తెలిపారు. అధునాతన సముద్ర నౌకల తయారీలో దేశీయ సామర్థ్యాన్ని పెంచుతూ, విదేశీ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో జీఆర్?ఎస్?ఈ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇక్కడే ఏఎన్?ఎస్ ద్రోణగిరి వంటి యుద్ధ నౌకలు నిర్మించబడ్డాయని గుర్తుచేశారు. సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్న జీఆర్?ఎస్?ఈకి నవరత్న హోదా దక్కడం అభినందనీయమన్నారు. రక్షణ పరిశ్రమలో యంత్ర ఇండియా లిమిటెడ్ కూడా కీలక భాగస్వామిగా ఎదుగుతోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2021 అక్టోబర్‌లో కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి సంస్థ ఆర్థిక, నియంత్రణ పరంగా మంచి పనితీరును కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ ఐదు ప్రాజెక్టుల్లో మూడు జీఆర్?ఎస్?ఈకి సంబంధించినవి కాగా, మరో రెండు యంత్ర ఇండియా లిమిటెడ్‌కు చెందినవి. నౌకా నిర్మాణం, యుద్ధ నౌకల మరమ్మతులు, ఆధునికీకరణ వంటి కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు జీఆర్?ఎస్?ఈ చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టుతో జీఆర్?ఎస్?ఈ రెండు చిన్న షిప్‌యార్డుల కోసం లీజు ఒప్పందాలు కుదుర్చుకుంది. హూగ్లీ నదికి ఇరువైపులా ఈ షిప్‌యార్డులు ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు రైచక్ ప్రాంతంలో నదీ తీరాన ఉన్న 32 ఎకరాల స్థలాన్ని కూడా జీఆర్?ఎస్?ఈ తన కార్యకలాపాల విస్తరణకు వినియోగించుకోనుంది. దీంతో యుద్ధ నౌకల నిర్మాణం, రీఫిట్ సామర్థ్యాలు మరింత పెరగనున్నాయి.

# ‘డీలిమిటేషన్ బిల్లు కోసమే లోక్‌సభను ఇంకా కొనసాగిస్తున్నారా’

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసినప్పటికీ, లోక్‌సభను అధికారికంగా ముగించడంలో (ప్రొరోగేషన్) జరుగుతున్న అసాధారణ జాప్యంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆదివారం మోదీ సర్కార్?పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల ద్వారా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును ఆమోదింపజేసుకోవడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారా అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. “సాధారణంగా లోక్‌సభ నిరవధికంగా వాయిదా (అడ్జర్నమెంట్ సైన్ డై) పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే సభను అధికారికంగా ముగిస్తూ (ప్రొరోగేషన్) ఉత్తర్వులు వస్తాయి. కొన్ని సందర్భాల్లో వాయిదా పడిన రోజే ఈ ప్రక్రియ కూడా పూర్తవుతుంది. ఈ లోక్?సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 10 రోజులు గడుస్తున్నా, సభ ముగింపుపై ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. గతంలో 2015 వర్షాకాల సమావేశాల ముగింపునకు 28 రోజులు, 2021లో 20 రోజులు పట్టిన మాట వాస్తవమే. కానీ అప్పట్లో దీని వెనుక ఎలాంటి దురుద్దేశపూర్వక వ్యూహాలు లేవు. మరి ఇప్పుడు జరుగుతున్న ఈ అసాధారణ ఆలస్యానికి కారణం ఏమిటి? ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, డీలిమిటేషన్? బిల్లును ఆమోదింపజేసుకోవడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారా? అందుకు కావాల్సిన 2/3 వంతు మెజారిటీ కోసం వెతుకుతున్నారా?”

**మహిళా రిజర్వేషన్‌తో ముడి!**



మహిళా రిజర్వేషన్‌తో ముడిపడి ఉన్న ఈ డీలిమిటేషన్? రాజ్యాంగ సవరణ బిల్లు, అంతకు ముందు జరిగిన బడ్జెట్ సమావేశాల్లో వీగిపోయింది. వాస్తవానికి ఈ బిల్లు ద్వారా లోక్?సభ స్థానాల సంఖ్యలను 850 వరకు పెంచాలని కేంద్రం భావించింది. కానీ 2/3 మెజారిటీ లేకపోవడంతో ఆ బిల్లుకు ఆమోదం లభించలేదు. అందుకే ఆ బిల్లును ఈసారి లోక్?సభలో ప్రవేశపెట్టేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. దీనిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లును పార్లమెంట్? ముందుకు మళ్లీ ఎప్పుడు తీసుకువస్తామనే దానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్దిష్ట కాలపరిమితిని ఖరారు చేయలేదని పేర్కొన్నారు. “మేము ఈ డీలిమిటేషన్ బిల్లును తీసుకువస్తామని ఎప్పుడు చెప్పాం? అయితే మీడియాలో కొన్ని ఊహాగానాలు వచ్చిన మాట వాస్తవం. దీనిని ఎప్పుడు తీసుకురావాలనేది మా అధినాయకత్వం పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాతే నిర్ణయిస్తుంది” అని స్పష్టం చేశారు. కాగా, కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఈ డీలిమిటేషన్? బిల్లును మహిళా రిజర్వేషన్లతో ముడిపెడుతున్నాయి. లోక్?సభలో ప్రస్తుతం ఉన్న స్థానాల పరిమితిలోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాదు తృణమూల్? కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (యూబీటీ) లాంటి పార్టీల నుంచి ఎంపీలను, బీజేపీ తన అక్కున చేర్చుకుని డీలిమిటేషన్ బిల్లును ఎలాగైనా ఆమోదింపజేసుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నాయి.

**మోదీ సర్కార్ ప్లాన్ ఇదేనా?**

కాగా, 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందాల్సి ఉంటుంది. గతంలో కూడా ఈ బిల్లుల ఆమోదం కోసం కేంద్రం ప్రయత్నాలు చేసినప్పటికీ అప్పట్లో తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో ముందుకు సాగలేదు. కానీ ఈసారి ఎలాగైనా 2/3 మెజారిటీతో ఆ బిల్లును ఆమోదింపజేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20తో మొదలై, ఆగస్టు 13 వరకు కొనసాగాయి. ఆగస్టు 13 తర్వాత నిరవధికంగా వాయిదా (అడ్జర్నమెంట్ సైన్? డై) వాయిదా పడ్డాయి కానీ, అధికారికంగా ప్రొరోగేషన్ ముగియలేదు. దీనిపైనే కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పిస్తోంది.

# మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం!

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అసంతృప్తి వ్యక్తం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)మరోసారి ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతోంది. జులై 25న దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనను విరమించినప్పటికీ, కేంద్రం నుంచి హామీల అమలుపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సోమవారం జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. జులై 25న ఆందోళన విరమించే సమయంలో కేంద్రం తమకు పలు హామీలు ఇచ్చిందని సీజేపీ తెలిపింది. వాటి అమలు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధికారికంగా తమకు తెలియజేయలేదని పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నమ్మి ఉద్యమాన్ని విరమించామని, తమ విశ్వాసాన్ని బలహీనతగా భావించొద్దని సీజేపీ హెచ్చరించింది. హామీల అమలుకు అవసరమైన అన్ని చర్యలను పరిశీలిస్తామని, అందులో మరోసారి శాంతియుత మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అవకాశమూ ఉందని స్పష్టం చేసింది. కేంద్రం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయడం, వేరే అర్థం చెప్పడం లేదా విస్మరించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించింది. అలా జరిగితే దేశ యువతకు చేసిన వాగ్దానానికి ద్రోహంగా భావిస్తామని స్పష్టం చేసింది.

**ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టులో విచారణ**

ఇటీవల ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం కూడా కీలకంగా మారింది. ఆగస్టు 18న దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల సమగ్ర జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరినట్లు సీజేపీ తెలిపింది. తమ ప్రకారం, సుప్రీంకోర్టు ఈ జాబితాను మూడుసార్లు కోరిందని, కేసులను కొట్టివేసేందుకు



రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను వినియోగించే అంశాన్ని పరిశీలించేందుకు ఈ వివరాలు అవసరమని తెలిపింది. అయితే కోర్టు పదేపదే కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ జాబితాను అందజేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వలేదని ఆరోపించింది.

**‘యువతను మోసం చేస్తున్నారా?’**

సుప్రీంకోర్టు విచారణ అనంతరం సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్, న్యాయ వ్యవహారాల విభాగం బాధ్యురాలు రత్నా సింగ్ ప్రభుత్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేసినట్లు పార్టీ తెలిపింది. కేంద్రంతో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీల ఆధారంగానే ఉద్యమాన్ని విరమించామని, ఇప్పుడు వాటి అమలులో జాప్యం జరుగుతుండటం యువతను మోసం చేసినట్లేనని వారు అభిప్రాయపడినట్లు పేర్కొంది. ముఖ్యంగా నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించడం, విద్యార్థులు లేదా శాంతియుత ఆందోళనకారులపై భవిష్యత్తులో శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా హామీ ఇవ్వడం వంటి అంశాలపై స్పష్టత కావాలని సీజేపీ కోరుతోంది.

**నీట్ బాధిత కుటుంబాలకు పరిహారం**

సీజేపీ డిమాండ్లలో మరో కీలక అంశం నీట్? యూజీ వివాదం. పేపర్ లీక్ కారణంగా మేలో పరీక్ష రద్దు కావడం, దాని తర్వాత కొందరు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశంపైనా కేంద్రం హామీ ఇచ్చిందని చెబుతోంది. అయితే పరిహారం, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ సహా లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం తమను అధికారికంగా సంప్రదించలేదని ఆరోపించింది. ఇక ఇటీవల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నాట్లు సుప్రీకంకోర్టు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది.

## పార్లమెంట్ సమావేశాలు ముగియలేదు, వాయిదానే వేశారు

పార్లమెంటు ఉభయసభలు నిరవధికంగా వాయిదాపడి 10రోజులు దాటినా వర్షాకాల సమావేశాలను ప్రభుత్వం ఇంకా అధికారికంగా ముగించలేదు.లో క్‌సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడి పది రోజులు గడిచినా, ఇప్పటివరకు సమావేశాల ప్రొరోగ్‌పై అధికారిక ప్రకటన వెలువడలేదు. రాష్ట్రపతి ఇంకా ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఇలా చేయడం వెనక కేంద్ర ప్రభుత్వ వ్యూహం ఏమైనా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు మరోసారి ఊపందుకున్నాయి. పార్లమెంట్ సమావేశాలు నిరవధిక వాయిదా కావడం, ‘ప్రొరోగ్’ కావడం రెండూ వేర్వేరు. సభలను నిరవధికంగా వాయిదా వేయడాన్ని అడ్జర్న్‌మెంట్ సైన్ డై అంటారు. అయితే రాష్ట్రపతి అధికారికంగా సమావేశాన్ని ముగిస్తూ ప్రకటన జారీ చేసినప్పుడే ప్రొరోగేషన్ పూర్తవుతుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వ సిఫార్సుతో పార్లమెంట్ సమావేశాలను పిలుస్తారు, ముగిస్తారు. సాధారణంగా ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే ప్రొరోగేషన్ జరగుతుంది. ఉదాహరణకు ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 18న ముగియగా, ఏప్రిల్ 20న ప్రొరోగేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ వర్షాకాల సమావేశాల విషయంలో మాత్రం పది రోజులు గడిచినా ఆ ఉత్తర్వలు జారీ కాలేదు.

**కీలక బిల్లుపై కేంద్రం వ్యూహమా?**

ఈ ఆలస్యానికి కారణం ఏంటన్న దానిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేకపోయినా, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన చట్ట సవరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్‌ను అమల్లోకి తీసుకురావడానికి అవసరమైన రాజ్యాంగ సవరణను కేంద్రం ముందుకు తీసుకురావచ్చనే ప్రచారం జరుగుతోంది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టం ఇప్పటికే ఆమోదం పొందింది. అయితే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. దీంతో డీలిమిటేషన్ అంశం కీలకంగా మారింది. బడ్జెట్ సమావేశాల సమయంలోనే దీనిపై చర్చ జరిగినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమకూరకపోవడంతో ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయిందనే ప్రచారం జరిగింది.

**దక్షిణాది రాష్ట్రాల ఆందోళన**

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే, జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభలో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆయా రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాలను పరిష్కరించేందుకు కేంద్రం ఒక ప్రత్యామ్నాయ ఫార్ములాపై కసరత్తు చేస్తోందనే చర్చ సాగుతోంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను సమాన ప్రాతిపదికన సుమారు 50 శాతం పెంచే ప్రతిపాదనపై ఆలోచనలు జరుగుతున్నట్లు సమాచారం. అలా చేస్తే డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్యం తగ్గకుండా, మొత్తం సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చని భావిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

**ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారా?**

స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లును ముందుకు తెచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు గతంలోనే వినిపించాయి. ఇప్పుడు వర్షాకాల సమావేశాల ప్రొరోగేషన్ ఆలస్యం కావడం ఈ చర్చలకు మరింత ఊతమిస్తోంది. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ప్రత్యేక సమావేశం నిర్వహణపై అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ, అవసరమైన సంఖ్యాబలం సమీకరించి కీలక బిల్లును ఆమోదింపజేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**కాంగ్రెస్ ప్రశ్నల వర్షం**

సెషన్ ప్రొరోగ్ కాకపోవడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ప్రొరోగ్? ఉత్తర్వులు ఎందుకు జారీ చేయలేదంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. సాధారణంగా లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లో ప్రొరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని గుర్తుచేశారు. పది రోజులు గడిచినా ఇంకా ప్రొరోగేషన్‌పై సమాచారం లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. డీలిమిటేషన్‌తో ముడిపడిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రత్యేక సమావేశంలో ఆమోదించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవసరమైన మూడింట రెండొంతుల మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. అయితే గతంలోనూ ప్రొరోగేషన్ ఆలస్యమైన సందర్భాలు ఉన్నాయని జైరాం రమేశ్ స్వయంగా పేర్కొన్నారు. 2015లో వర్షాకాల సమావేశాల అనంతరం 28 రోజులు, 2021లో 20 రోజుల వ్యవధి ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. అయితే అప్పట్లో ప్రస్తుతం కనిపిస్తున్నట్లుగా ఎలాంటి రాజకీయ వ్యూహాలు లేవని ఆయన వ్యాఖ్యానించారు.

**విజయ్ వ్యాఖ్యలతో కొత్త చర్చ**

డీలిమిటేషన్ అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. ఆగస్టు 21న మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. జనాభా నియంత్రణలో విజయం సాధించిన కారణంగా ఏ రాష్ట్రానికీ పార్లమెంట్‌లో ప్రాతినిధ్య శాతం తగ్గకుండా కేంద్రం స్పష్టమైన చట్టపరమైన హామీ ఇవ్వాలని విజయ్ కోరారు. మరోవైపు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాత్రం ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543గానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కనీసం వచ్చే 25 ఏళ్ల పాటు సీట్ల సంఖ్యను మార్చకూడదని కేంద్రాన్ని కోరారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల ప్రొరోగేషన్‌పై కేంద్రం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుంది? మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై ఏదైనా కొత్త ఫార్ములాను ముందుకు తెస్తుందా? ప్రత్యేక సమావేశానికి తెరలేపుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## చేదెక్కిన చక్కెర

**ముంబై :** దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలను నియంత్రించడానికి, రాబోయే పండుగ సీజన్‌లో తగినంత లభ్యతను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్యమైన చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రకారం చక్కెర ధర జూలై 20న కిలోగ్రాముకు రూ..48.18 నుండి ఆగస్టు 20 నాటికి కిలోగ్రాముకు రూ.55.70కి పెరిగింది. ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అనవసరమైన ధరల పెరుగుదల, నిల్వలు, కృత్రిమ కొరతలను నివారించడానికి చర్యలు తీసుకుంటోంది పండగల వేళ 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుతించింది కేంద్రం. చక్కెర వ్యాపారులకు 400 టన్నుల స్టాక్ లిమిట్‌ను విధించింది. అయితే చక్కెర నిల్వలపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇటీవలి చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తిని నిందించడం సరికాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో సుమారు 12% నుండి 2025-26 నాటికి సుమారు 9%కి తగ్గుతుంది. అంతేకాకుండా, దేశంలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌లో సుమారు ముప్పావు వంతు ఇప్పుడు ధాన్యాల నుండి, ప్రధానంగా మొక్కజొన్న నుండి ఉత్పత్తి అవుతోంది.ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది.

## బైకును ఢీ కొన్న గుర్తు తెలియని వాహనం

**అక్కడికక్కడే మృతి చెందిన వలేపు చెంచు కుమార్**

స్వర్ణసాగరం చిల్లకూరు



వాకాడు మండలం కొండాపురం పంచాయతీ పరిధిలోని వడ్డీ పాలెం గ్రామానికి చెందిన వలేపు చెంచుకుమార్ ఓజిలి మండలం పునర్వరి వారి పాలెంలో ఉన్న అంజిని టైల్స్ కర్మకారం నందు పనిచేస్తున్నాడు కాగా ఆదివారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో వృత్తిరీత్యా డ్యూటీకి వెళుతుండగా చిలుకూరు మండలం కమ్మవారిపాలెం నయారా పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొని వెళ్లిపోయింది.ఈ ప్రమాదంలో చెంచు కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు.దీన్ని గుర్తించిన స్థానికులు పోలీసు వారికి సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# బడులు ఖాళీ అవుతున్నా బాబు అబద్ధాలు!

-మొదటిపేజీ తరువాయి
ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని పదే పదే ప్రచారం చేసుకుంటోందంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆధారం లేని ప్రకటనలు చేయడం, ఆ తర్వాత అధికారిక గణాంకాలతో దొరికిపోవడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయిందంటూ చంద్రబాబు సర్కార్‌కు చురకలంటించారు. 'యూడైస్' గణాంకాలను ఉటంకిస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యా రంగంలో కూటమి సర్కార్ అనుసరిస్తున్న తీరును కడిగిపారేశారు. విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి అడుగూ ముందుకు వేసిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు తగ్గుతున్నాయని, విద్యార్థుల సంఖ్య పడిపోతుండగా.. ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ఎత్తిచూపారు. ఇది ప్రభుత్వ పాఠశాల విద్యా రంగంలో ఆందోళనకర పరిణామమంటూ 'ఎక్స్'లో తన ఖాతాలో ఆదివారం వైఎస్ జగన్ పోస్టు చేశారు. వైఎస్ జగన్ ఆ పోస్టులో ఏమన్నారంటే..

**బాబు ప్రభుత్వ డొల్ల ప్రచారం.. ఈ లెక్కలే సాక్ష్యం..**

'మా ప్రభుత్వ చివరి ఏడాది అయిన 2023--24తో పోలిస్తే 2025--26లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు భారీగా తగ్గిపోయింది. కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం, ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని పదే పదే ప్రచారం చేసుకుంటోంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగిందనడానికి ఇదే నిదర్శనమని చెప్పుకుంటోంది. ఆధారం లేని ప్రకటనలు చేయడం, ఆ తర్వాత అధికారిక గణాంకాలతో దొరికిపోవడం కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయింది.

' నిజంగా 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరితే ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం విద్యార్థుల సంఖ్య పెరగాలి కదా? కానీ కేంద్ర విద్యాశాఖకు చెందిన 'యూడైస్' వెల్లడించిన అధికారిక గణాంకాలు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. 2023--24 విద్యా సంవత్సరం, 2025--26 విద్యా సంవత్సరంతో పోల్చి చూస్తే, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40,50,116 నుంచి 34,93,450కి పడిపోయింది. అంటే ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారు. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 45 వేల నుంచి 44,222 కు తగ్గిపోయింది. ఇంకా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల సంఖ్య కూడా 991 నుంచి 797కు పడిపోయింది. మరోవైపు అదే సమయంలో ప్రైవేటు యాజమాన్యంలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు పెరిగింది.

' అలా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గిపోతుంటే ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం పెరుగుతున్నారు. అంటే, కూటమి ప్రభుత్వం చెబుతున్నది ఒకటైతే, కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్న వాస్తవాలు మరొకటి. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితికి, ప్రభుత్వ ప్రచారంలోని డొల్లతనానికి ఈ లెక్కలే ప్రత్యక్ష సాక్ష్యం.

**ప్రైవేటు విద్యా సంస్థలతో టీడీపీకి ఉన్నఅపవిత్ర సంబంధం కారణంగానే..**

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేటు విద్యా రంగంలో నారాయణ, శ్రీచైతన్య, భాష్యం, విజ్ఞాన్, గీతం వంటి సంస్థల ఆధిపత్యం ఉంది. ఈ సంస్థలతో టీడీపీకి ఉన్న అపవిత్ర సంబంధాల కారణంగానే ప్రభుత్వ విద్యావ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తూ, ప్రైవేటు విద్యా సంస్థల అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం బాట వేస్తోందన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో చదివించే ఆర్థిక స్థోమత లేని పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేస్తున్న అత్యంత ఆందోళనకరమైన పరిస్థితి ఇది.

**విద్యారంగంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు**

' వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019--24 మధ్య విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చింది. మనబడి నాడు--నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, జూనియర్ కళాశాలలు కలిపి 56,703 విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. ఫర్నిచర్, రక్షిత మంచినీరు, రన్నింగ్ నీటి సదుపాయంతో కూడిన మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు తదితర సదుపాయాలతో ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలను మార్చాం. మొదటి దశలో 15,715 పాఠశాలల్లో పనులు పూర్తి చేశాం. రెండో దశలో 22,344 పాఠశాలలకు పనులను విస్తరించగా, మూడో దశ పనులు కూడా 2024 జూన్ నాటికి కొనసాగుతున్నాయి. నాడు--నేడు కార్యక్రమం కోసం మా ప్రభుత్వం రూ.8,524 కోట్లు ఖర్చు చేసింది.

' ఎనిమిదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందించాం. పేద పిల్లలు ప్రపంచస్థాయిలో పోటీ పడాలనే లక్ష్యంతో ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాం. విద్యార్థులు సులభంగా ఆంగ్ల మాధ్యమంలోకి మారేందుకు ద్విభాషా పాఠ్యపుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను అందించాం. ఆరో తరగతి నుంచి ప్రతి తరగతి గదిలో డిజిటల్ బోధన కోసం 62 వేల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేశాం. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులున్న పాఠశాలల్లో 45 వేల స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశాం. ఇంకా మూడో తరగతి నుంచే విద్యార్థుల్లో స్పోకెన్ ఇంగ్లిష్‌లో నైపుణ్యం పెంపొందించేందుకు టోఫెల్ శిక్షణ ప్రవేశపెట్టాం. ఇంకా విద్యార్థులకు అంతర్జాతీయ టోఫెల్ సర్టిఫికేషన్ అందించేందుకు అమెరికాకు చెందిన ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్)తో ఒప్పందం చేసుకున్నాం.

' ఇంకా మన పిల్లలు ప్రపంచస్థాయిలో పోటీ పడి విజయం సాధించాలనే లక్ష్యంతో ఇంటర్నేషనల్ బాకలారియేట్--ఐబీ విద్యా విధానాన్ని కూడా ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించాం. ఐబీ విధానంపై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, ఇతర విద్యాశాఖ సిబ్బందికి శిక్షణ, సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.

' ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు మన ప్రభుత్వం ప్రతి అడుగూ ముందుకు వేసింది. కానీ ఈరోజు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు తగ్గుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పడిపోతుండగా, ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇది ప్రభుత్వ పాఠశాల విద్యా రంగంలో ఆందోళనకర పరిణామం.

# 12వ వేతన ఒప్పందమేది?..
# కార్మిక కుటుంబాల్లో ఆందోళన

**పెద్దపల్లి, :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) కార్మికులకు కేంద్ర ప్రభుత్వం, కోల్ ఇండియా యాజమాన్యం 12వ వేతన ఒప్పందంపై తీవ్ర జాప్యం చేస్తున్నాయి. 1 జూలై 2026 నుంచి అమల్లోకి రావాల్సిన వేతన ఒప్పందంపై ఇంతవరకు చర్చలే ప్రారంభించకపోవడంపై కార్మికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. గడువు ముగిసినప్పటికీ జాయింట్ బై పార్టీ కమిటీ ఫర్ కోల్ ఇండస్ట్రీస్ (జేబీసీసీఐ) వేతన స్థిరీకరణ కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో రాష్ట్రంలోని 45 వేల మంది కార్మికులు, ఉద్యోగుల కుటుంబాల్లో ఆందోళన నెలకొన్నది. కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను అమలు చేస్తేనే వేతన చర్చలు అంటూ కోల్ ఇండియా యాజమాన్యం కాలయాపన చేస్తున్నది. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను సింగరేణిలోని టీబీజీకేఎస్, ఏఐటీయూ, ఐఎన్‌టీయూసీలు వ్యతిరేకిస్తున్నాయి. 1967 నుంచి ప్రతి ఐదేండ్లకోసారి సకాలంలో వేతన ఒప్పందం జరిగేది. లేబర్ కోడ్‌లతో సంబంధం లేకుండానే కేంద్రం కార్మిక సంఘాల ప్రతినిధులతో జేబీసీసీఐని ఏర్పాటు చేయాలని, లేకపోతే వచ్చే నెల 12న ఢిల్లీలో జాతీయస్థాయి కార్మిక సదస్సు నిర్వహించి కార్యాచరణ ప్రకటించాలని ప్రధాన సంఘాలు నిర్ణయించాయి. దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల కార్మికులకు అమలు చేయాల్సిన వేతనాలు, అలవెన్స్‌ను ఖరారు



చేసేందుకు కేంద్రం, కోల్ ఇండియా కార్మికసంఘాలతో 1967 నుంచి జేబీసీసీఐ ఏర్పాటు చేసింది. 1వ వేజ్ బోర్డు 1 జనవరి 1975 నుంచి 31 డిసెంబర్ 1978 కాలాన్ని నిర్ణయించారు. 12వ వేజ్ బోర్డు 1 జూలై 2026 నుంచి అమల్లోకి రావాలి. జేబీసీసీఐ ఏర్పాటు చేసి, 12వ వేతన చర్చలు ప్రారంభించాలని, లేకుంటే సింగరేణి నుంచి జాతీయ స్థాయి వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

## లోకల్ పోల్స్ కోసం జనసేన ప్లాన్

స్వర్ణసాగరం విజయవాడ

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యేలకు అత్యంత స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనసేన లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే వర్తిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అదే ఫార్ములా ఉండబోదని తేల్చిచెప్పారు. ప్రాంతాలవారీ రాజకీయ, సామాజిక సమీకరణాల ఆధారంగా జనసేన వ్యూహం స్వతంత్రంగా, ప్రభావశీలంగా ఉంటుందని స్పష్టం చేశారు.ఐదేళ్ల పాటు పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాబోయే స్థానిక ఎన్నికల్లో అడుగులు వేయాలని పవన్ పిలుపునిచ్చారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదిరించి జనసేన కార్యకర్తలు ధైర్యంగా నిలబడ్డ విషయాన్ని, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి చారిత్రాత్మక విజయానికి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చేసిన అసమాన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. పార్టీ కోసం నిలబడిన ప్రతి కార్యకర్త రాజకీయ బలోపేతమే లక్ష్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు మెరుగైన అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.స్థానిక ఎన్నికల విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు అధినేత ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, జనసేన పోటీ చేయడానికి తగిన స్థానాలు, పట్టున్న ప్రాంతాలను గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జనసేన శ్రేణుల మనోభావాలు, స్థానిక రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో కూటమి ధర్మానికి భిన్నంగా జరుగుతున్న పరిణామాలు, జనసేన శ్రేణుల అసంతృప్తిపై సమావేశంలో ఎమ్మెల్యేలు పార్టీ చీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్.. కార్యకర్తల మనోభావాలు, అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూనే, జనసేన బలం ఉన్న ప్రతిచోటా గౌరవప్రదమైన ప్రాతినిధ్యం దక్కేలా చూస్తామని, రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన తన సత్తా చాటుతుందని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు.

**జనసేన కేడర లో కొత్త జోష్**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఈసారి రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. కూటమిలో పొత్తుకు భంగం కలగకుండా, తమకు నష్టం జరగకుండా స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే అభిప్రాయాన్ని త్వరలో చంద్రబాబు నాయుడు ముందు కూడా ఉంచనున్నారు. శాసనసభ ఎన్నికల తరహాలో తమ పార్టీకి తక్కువ స్థానాలు ఇవ్వాలన్న ఆలోచన ఉంటే వాటిని సరిచేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. 21 స్థానాల్లో పోటీ చేయడం అనేది అప్పటి పరిస్థితుల వరకే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల వ్యూహం వర్తించదు.. జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవం కాపాడుతామని పవన్ కల్యాణ్ అనడం చర్చనీయాంశమైంది.. త్వరలోనే కమిటీలను నియమించి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కూడా పవన్ నిర్ణయించారు. జనసేన శాసనసభ పక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై లోతుగా చర్చించామని పవన్ కల్యాణ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ముందుకు తీసుకువెళ్తామని పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెప్పారు. నేడు కేరళం కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు. నేటి నుంచి 20 రోజులపాటు కేరళంలోని ప్రకృతి వైద్య చికిత్సా కేంద్రంలో ఉండనున్న పవన్ చికిత్స చేయించుకోనున్నారు. తరచూ అనారోగ్యానికి గురవుతున్న పవన్ కల్యాణ్ 20 రోజుల పాటు వైద్య శిబిరంలో పవన్ కల్యాణ్ చికిత్సను చేయించుకోనున్నారు. కేరళం నుంచి వచ్చిన వెంటనే చంద్రబాబుతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై చర్చించనున్నారు. జనసేనకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముప్పయి శాతం స్థానాలను దక్కేలా అవసరమైతే టీడీపీ పై వత్తిడి తేవాలని కూడా నిర్ణయించుకున్నారు. గత కొంతకాలంగా పవన్ కల్యాణ్ ముఖ్యమైన సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ ప్రారంభోత్సవానికి రాలేదు. మంత్రి వర్గ సమావేశానికి రాలేదు.

## అంతరిక్ష రంగంలో అగ్రస్థానానికి భారత్

-మొదటిపేజీ తరువాయి
సమూహం, రిస్క్ తీసుకునే సామర్థ్యం మన బలం. వీటితో ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ అగ్రస్థానానికి చేరుకోగలదు. ప్రపంచం ఇప్పుడు భారతీయ స్టార్టప్‌ల వైపు ఆసక్తి చూస్తోంది. ఎప్పుడైతే ఒక పురోగతి జరుగుతుందో, ప్రజల దృష్టి వెంటనే అటువైపు మళ్లుతుంది. మన అంతరిక్ష పరిశ్రమలోకి ప్రైవేట్ సంస్థలకు ద్వారాలు తెరిచిన తర్వాత సానుకూల ధోరణి కనిపించింది"అని అన్నారు.

## తూర్పు భారతావనికి రాజమార్గం

-మొదటిపేజీ తరువాయి
వంటి ఏజెన్సీ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం లభించడంతో పాటు పర్యాటకం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు పెద్దపీట వేసినట్లవుతుంది. ఇప్పటికే ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపిన చంద్రబాబు, త్వరితగతిన సాంకేతిక, ఆర్థిక అనుమతులు, భూసేకరణ ప్రక్రియలు పూర్తి చేసి టెండర్ల దశకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ రహదారి పూర్తయితే రాష్ట్ర రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు రావడం ఖాయం.

# కాంగ్రెస్‌లో కష్టమే.. వేరే పార్టీలు చేర్చుకోవు!

**వరంగల్ :** వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మొదటినుంచీ దూకుడు వైఖరి ప్రదర్శించే మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి కుటుంబం.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపైనే నేరుగా బహిరంగ తిరుగుబాటు బావుటా ఎగురవేయడం తెలంగాణ కాంగ్రెస్‌లో పెను ముసలానికి దారితీసింది. పరకాల పర్యటనలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని సీఎం పిలుపునిచ్చిన వెంటనే.. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ సీఎం రేవంత్‌పై తీవ్రమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. తల్లిదండ్రుల ప్రత్యక్ష ఆశీస్సులు, సంపూర్ణ రాజకీయ మద్దతు లేకుండా కేవలం ఒక కుమార్తెగా ఆమె రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఇంతటి తీవ్రస్థాయి వ్యాఖ్యలు చేయడం అసాధ్యమని, ఇది పూర్తిగా కొండా దంపతుల వ్యూహాత్మక రాజకీయమే. ఈ దూకుడు వెనుక ఉన్న ప్రధాన కారణం పరకాల నియోజకవర్గంలో తమ పట్టును, వచ్చే తరం రాజకీయ వారసత్వాన్ని కాపాడుకునే తాపత్రయమే. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపిస్తూనే, తమ కుమార్తె సుస్మితను పరకాల నుంచి బరిలోకి దించాలన్న పట్టుదలతో కొండా కుటుంబం ఉంది. అయితే రేవంత్ రెడ్డి మాత్రం రేవూరి ప్రకాష్ రెడ్డికి పరోక్షంగా మద్దతు ప్రకటించడంతో కొండా వర్గంలో అభద్రతాభావం తారాస్థాయికి చేరింది. అధిష్ఠానాన్ని, సీఎంను తీవ్రస్థాయిలో బెదిరించి, ఒత్తిడి తీసుకురావడం ద్వారానే తమ రాజకీయ డిమాండ్లను సాధించుకోవచ్చనే పాత పంథానే వారు మళ్లీ నమ్ముకున్నట్లు కనిపిస్తోంది.

అయితే ఈ తరహా దూకుడు రాజకీయాలు కొండా కుటుంబ రాజకీయ భవిష్యత్‌కు చేటు తెచ్చే ప్రమాదం ఉంది. గతంలో వైఎస్సార్ మరణానంతరం వైఎస్సార్‌సీపీలోకి వెళ్లడం, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి అనుభవించి అక్కడా కేసీఆర్‌పై తిరుగుబాటు చేసి కాంగ్రెస్‌కు రావడం వంటి వరుస పార్టీ మార్పిడుల చరిత్ర వారికి ఉంది. క్రమశిక్షణారాహిత్యంతో సొంత ప్రభుత్వాలపైనే రచ్చకెక్కే నైజం ఉన్న నేతలను చేర్చుకోవడానికి విపక్ష బీఆర్ఎస్ లేదా బీజేపీ వంటి ఇతర పార్టీలు కూడా సుముఖంగా ఉండే అవకాశం లేదు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటే లేదా కేబినెట్ నుంచి తప్పిస్తే.. రాజకీయంగా ఒంటరిపాటు కావడం ఖాయమనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో కొండా కుటుంబం తీసుకుంటున్నది అత్యంత ప్రమాదకరమైన జూదమని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఉంటూనే సీఎం స్థాయి వ్యక్తిపై బరితెగించి ఆరోపణలు చేయడం వల్ల తాత్కాలికంగా మీడియా మైలేజ్ లభించినప్పటికీ, దీర్ఘకాలికంగా అది వారి రాజకీయ పునాదులకే గొడ్డలిపెట్టుగా మారే అవకాశం ఉంది.

కొండా సురేఖ భవిష్యత్తు తేల్చేది ఆ లేఖేనా

సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సమయంలో మంత్రి కొండా సురేఖ స్వయంగా కల్పించుకుని, కూతురి వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సీఎంకు క్షమాపణలు చెప్పి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. అయితే, ఒకసారి పొరపాటు జరిగిందని సరిదిద్దుకున్న తర్వాత కూడా మళ్లీ అదే తరహాలో ముఖ్యమంత్రిపై బహిరంగ విమర్శలు చేయడం వెనుక గల ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరిగా కేవలం ఒక క్షమాపణ లేఖతో ఈ వివాదం సద్దుమణుగుతుందా? లేక అధిష్ఠానం కఠిన నిర్ణయాల దిశగా అడుగులు వేస్తుందా? అన్నది పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. క్రమశిక్షణ కమిటీకి సమర్పించే లేఖలో కొండా సురేఖ ఏ వైఖరి తీసుకుంటారనే అంశంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆమె ముందు ప్రధానంగా మూడు అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకటి కూతురి వ్యాఖ్యలకు మద్దతు తెలపడం. కూతురు లేవనెత్తిన అంశాలను సమర్థిస్తే అది నేరుగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినట్లే అవుతుంది. ఇది మంత్రి పదవికి ముప్పు తెచ్చే ప్రమాదం ఉంది. రెండోది కూతురి వ్యాఖ్యలను ఖండించి క్షమాపణ కోరడం. కూతురి వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని తేల్చిచెప్పడం. తద్వారా అధిష్ఠానం ఆగ్రహం నుంచి తప్పించుకోవడం. మూడోది పరకాల రాజకీయాన్ని తెరపైకి తేవడం. కూతురి వ్యాఖ్యలపై పెద్దగా స్పందించకుండా, స్థానిక రాజకీయం, పరకాల నియోజకవర్గంలో తమ వర్గానికి జరుగుతున్న అన్యాయం, గ్రూపు రాజకీయాల వల్లే అసహనంతో ఈ వ్యాఖ్యలు వచ్చాయనే విషయాన్ని లేఖలో ప్రస్తావించడం.కొండా కుటుంబానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం, బలమైన క్యాడర్ ఉన్నాయి. అయితే, ప్రస్తుత అధికార కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రితో నేరుగా తలపడటం కొండా దంపతుల రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. క్రమశిక్షణ కమిటీకి ఇచ్చే వివరణ అసంతృప్తికరంగా ఉంటే అధిష్ఠానం ఎలాంటి కఠిన నిర్ణయానికైనా వెనుకాడకపోవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖ పంపే లేఖ ఈ వివాదానికి ముగింపు పలుకుతుందా, లేక కాంగ్రెస్ పార్టీలో సరికొత్త రాజకీయ సంక్షోభానికి నాంది పలుకుతుందా అనేది కొద్ది గంటల్లో తేలనుంది.

swarna sagaram_Swarna sagaram.qxd 8/24/2026 12:03 AM Page 1



# బీ సి రిజర్వేషన్ పై ప్రభుత్వం కు ధన్యవాదములు తెలిపిన బీసీ నాయకులు

వరదయ్య పాలెం స్వర్ణ సాగరం ఆగస్టు 23

ఆంధ్రప్రదేశ్ బి.సి ఫెడరేషన్ రాష్ట్ర కో కన్వీనర్, దేవాంగ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు గుత్తి త్యాగరాజు ఆధ్వర్యంలో స్థానిక బస్ స్టాండ్ ఆవరణలో ప్రభుత్వంకు ధన్యవాదములు కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ సమావేశంలో గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలలో 33.33% రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు , గౌరవ ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ , యువ నాయకులు గౌరవ శ్రీ నారా లోకేష్ , బీసీ శాఖ మాత్యులు గౌరవ శ్రీమతి సవిత గారి నాయకత్వంలో తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ కూటమి ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సామాజిక వర్గాల తరఫున హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు, బీసీలకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత దానిని 34 శాతానికి పెంచుతూ మరొకసారిత్రాత్మక నిర్ణయం తీసుకుని బీసీలకు చట్టసభలలో ప్రాధాన్యత పెంచారు, కానీ మధ్యలో వైఎస్ఆర్సిపి అధికా రంలోకి వచ్చిన తర్వాత సాంకే తిక కోర్టు తీర్పులు కారణంగా అమలు చేయలేకపోయినా రిజర్వేషన్ మరల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆచర ణలోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు తెలిపారు,అలాగే ప్రకటించిన ఈ రిజర్వేషన్లు చట్టబద్ధత కల్పించి, సాంకేతిక ఇబ్బం దులు, న్యాయపరమైన ఇబ్బం దులు రాకుండా ప్రణాళిక చేసి అమల్లోకి వచ్చే విధంగా చేయాలని ప్రభుత్వానికి సూచించారు,అలాగే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో యువతకు తగిన ప్రాధాన్యతను ఇవ్వాల ని, రోస్టర్ విధానాన్ని కొనసాగించాలని చట్టసభల్లో సరైన ప్రాతి నిధ్యం లేని బిసి సామాజిక వర్గాలకు స్థానిక సంస్థల్లో ప్రాధా న్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు, అలాగే అంచెల ంచలుగా బీసీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్న కూటమి ప్రభుత్వం బీసీ రక్షణ చట్టాన్ని కూడా త్వరలో అమలు చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు సి జానకిరామ్,లక్ష్మయ్య ధనుంజయశెట్టి,కల్లూరు మల్లికార్జున, ఆర్ కే శ్రీను,పసుపులేటి విజయ్ కుమార్, నాయిబ్రాహ్మణ శ్రీను,గోదారి ప్రకాష్, మాచర్ల లోహిత్, పృథ్వి ఈశ్వరయ్య,చట్టా చెంగల్వారా యులు,కే శివయ్య, బీజేపీ మండల అధ్యక్షులు దిలీప్ రాయల్, జనసేన పార్లమెంట్ కమిటీ మెంబెర్ తడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం.

ఉడా చైర్మన్ డా. సురేష్ బాబు

స్వర్ణ సాగరం.రామకుప్పం ఆగస్టు 23

ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొందని పీకేఎం ఉడా చైర్మన్ డా. సురేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సింగసముద్రం గ్రామంలో ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి రెండేళ్ల సంక్షేమం అభివృద్ధి కార్యక్రమం లో భాగంగా డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 రోజుల్లో 75 లక్షల కుటుంబాలను టీడీపీ కార్యకర్తలు కలవడం సంచలనంగా మారిందని, ఈ ప్రజా చైతన్య ప్రయాణంలో ప్రజల భాగస్వామ్యం రోజురోజుకూ గణనీయంగా పెరుగుతుండటం, ప్రతి గడపలో పార్టీపై తమపై నమ్మకం బలపడటం తెలుగుదేశం శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతోందని తెలిపినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, మంత్రి నారా లోకేష్ గారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలే అధినాయకులుగా వారి సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్, పూర్ టూ రిచ్ వంటి పథకాలను ప్రతి ఇంటికి వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, జిల్లా టిడిపి ముఖ్య నేత పట్ర నారాయణ, ఎంపీపీ సులోచన గురప్ప, యూనిట్ ఇంచార్జ కృష్ణ, మండల తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, యువత ప్రధాన కార్యదర్శి వెంకటాచలపతి, చంద్ర, హనుమప్ప తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.



# అంకాళమ్మ పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు





పెళ్ళకూరు స్వర్ణసాగరం ఆగస్టు23.

మండలంలోని మోదుగులపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అంకాలమ్మ పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఆదివారం స్థానికులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో విద్యుత్ దీపాలతోనూ మామిడి తోరణాలతోనూ అందంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా చదువు పందిళ్ళతో ఏర్పాటుచేసి భక్తులు కనుకూలంగా నిర్మించారు. మంగళ వాయిద్యములు మేళ తాళాలు నడుమ వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారి శిలావిగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. గణపతి పూజ కలిసస్థాపన కుంకుమార్చన చేపట్టి ఆలయ అర్చకులు అంతా కలిసి మహా కుంభాభిషేకం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ దేవా రెడ్డి నాగేంద్ర రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టి మ్రొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

# వర్షం కోసం గ్రామస్తుల ప్రత్యేక పూజలు







స్వర్ణసాగరం బైరెడ్డిపల్లి ఆగస్ట్ 23:-

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం, ఏం కొత్తూరు పంచాయతీ రామసముద్రం గ్రామంలో వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కప్ప, రోకలిని పూజించిన అనంతరం గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. సుమారు 70 కుటుంబాలకు చెందిన పిల్లలు, పెద్దలు, మహిళలు పాల్గొని వరుణ దేవుడిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని కోరుకున్నారు.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్టరీత్య నేరం





స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఉబ్బలమడుగు సమీపంలో స్థానిక ఎస్ఐ హరిప్రసాద్ తన సిబ్బందితో కలిసి ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడపడం చట్టరీత్య నేరమని ,వాహనా లను ర్యాష్ డ్రైవింగ్ నడిపిన వారికి ఫైన్ విధించి ,చట్టరీత్య నేరమని నడిపిన వారికి కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# మనుబోలు మండలంలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల



మనుబోలు, స్వర్ణ సాగరం:

మనుబోలు మండలంలో ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. మండలంలో అవసరమయ్యే పోలింగ్ స్టేషన్ల వివరాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నట్లు ఏఈఆర్వో జలజాక్షి తెలిపారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను అధికారికంగా ప్రచురించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నెల 23న ఈ వివరాలను బహిరంగంగా ప్రచురిస్తామని వెల్లడించారు. ఆగస్టు 26, 29 నాటికి 31న అధికారికంగా విడుదల ప్రచురించిన ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజల నుండి ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే నిర్ణీత గడువులోగా తెలపాలని కోరారు. వచ్చిన వినతులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, జిల్లా కలెక్టర్ల ఆమోదంతో ఈ నెల 31న తుది జాబితాను ప్రకటిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాసులు, గరుడయ్య, ఏవో ముజీబున్నిసా, సీనియర్ అసిస్టెంట్ సునీల్ కుమార్ రెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్ల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని నిత్య అన్నదానంకి విరాళం

## ఆలయ అధికారులకి అందజేస్తున్న దాతలు



కాణిపాకం, స్వర్ణ సాగరం ఆగస్టు 23 :

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్ కి విరాళం 1,00,116 రూపాయలుదాత లోకనాథ శెట్టి , కడప వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, తదితరులు ఉన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 8/24/2026 12:03 AM Page 2



# చరణ్ రెడ్డి కి ఘన నివాళులు

డాక్టర్ సునీల్ కుమార్



ఐరాల, స్వర్ణ సాగరం ఆగస్టు 23

ఐరాల మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చరణ్ కుమార్ రెడ్డి కి ఘన నివాళులు.ఐరాల మండలం అగరంపల్లి కి చెందిన శైలజ చరణ్ రెడ్డి భర్త, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్మక్రియల సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన పూతలపట్టు నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ ఎం. సునీల్ కుమార్ .ఈ సందర్భంగా చరణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన సేవలు, పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత ఎల్లప్పుడూ స్మరణీయమే సునీల్ కుమార్ అన్నారు.కాణిపాకం మాజీ సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి,గుండ్లపల్లి పల్లె ఎంపిటిసి లోకేశ్వర రెడ్డి,సీనియర్ నాయకులు నిరంజన్ రెడ్డి, వరప్రసాద్ తదితర నాయకులు నివాళులు అర్పించారు కార్యక్రమంలో జిల్లాలోని పలువురు నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు .


# పదవి విరమణ సందర్భంగా హవల్దార్ దొరబాబు కు ఘనసత్కారం



ఐరాల, స్వర్ణ సాగరం ఆగస్టు 23

: ఐరాల,చిత్తూరు మురకంబట్టు నివాసం ఉంటున్న హవల్దార్ దొరబాబు 19 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకుని పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆర్మీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ హవల్దార్ దొరబాబు ఆర్మీలో 19 సంవత్సరాలు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, జమ్మూ కాశ్మీర్, ఇజ్రాయిల్ పోర్సు, ఆగ్రా నందు దేశ సేవలు చేశారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆర్మీ అసోసియేషన్ ఫౌండర్ లోకేష్ సూచనల మేరకు ఆదివారం హవల్దార్ దొరబాబు దంపతులకు శాలువా కప్పి, ఘనంగా పూల మాలతో సత్కరించారు. ఈ సందర్భంగా హవల్దార్ దొరబాబు మాట్లాడుతూ నేను కూడా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఆర్మీ సైనికులు మురళి, దుర్గా, భార్గవ్, సర్వీస్ ఆర్మీ సైనికులు హేమాద్రి, మనోజ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ శ్రీ దుర్గమ్మ తల్లి గ్రామ పొంగళ్ళు





మనుబోలు, స్వర్ణ సాగరం:

మండల పరిధిలోని యాచవరం గ్రామంలో శ్రీ శ్రీ దుర్గమ్మ తల్లి గ్రామ పొంగళ్ళు, కుంబాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ముగిశాయి. గ్రామంలోని శ్రీ శ్రీ దుర్గమ్మ చావిడి వద్ద నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. యాచవరం గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలు, ముత్తైదువులు కొత్త కుండలలో నైవేద్యాలు సిద్ధం చేసి అమ్మవారికి పొంగళ్ళు సమర్పించారు.మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి కుంబాభిషేకం వలస కార్యక్రమాలను వేదమంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భక్తి గీతాలాలాపన, స్థానిక కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. "గ్రామ పెద్దలు, యువకుల సహకారంతో ప్రతి ఏటా నిర్వహించే ఈ సంప్రదాయ వేడుకలు గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి." అని నిర్వాహకులు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ ఉత్సవంతో యాచవరం గ్రామం మొత్తం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.

# ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతి నివాళులు అర్పించిన చిత్తూరు జిల్లా పోలీసులు.





చిత్తూరు.స్వర్ణసాగరం.ఆగస్టు 23

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన మహనీయ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాసేవకుడు, ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారి జయంతిని జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా సాయుధ దళం కార్యాలయంలో ఏ.ఆర్. డి.ఎస్పీ శ్రీ మహబూబ్ బాషా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డి.ఎస్పీ మాట్లాడుతూ1872 ఆగస్టు 23న ప్రకాశం జిల్లా కనుపర్తి గ్రామంలో జన్మించిన టంగుటూరి ప్రకాశం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అపారమైన ధైర్యసాహసాలతో పేరు గాంచారు.టంగుటూరి ప్రకాశం కేవలం స్వాతంత్ర్య సమరయోధుడే కాదు, న్యాయం, నిజాయితీ, సమా నత్వం కోసం నిలబడిన మహా నాయకుడు. పోలీస్ శాఖగా మనం ప్రజల హక్కులను రక్షించే క్రమంలో ఆయన చూపిన ధైర్యం, సమర్పణ మనకు స్ఫూర్తి కావాలి అని పేర్కొన్నారు.ప్రకాశం పంతులు గారు 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి ముఖ్యమంత్రిగా పనిచేశారు. రైతుల సంక్షేమం, విద్యా అభివృద్ధి, పారిశ్రామిక రంగం వృద్ధి కోసం అనేక సంస్కరణలు చేపట్టారు. ఆయన జీవితం ప్రజల సేవకే అంకితం అయింది.పోలీసులుగా మన కర్తవ్యం కేవలం చట్టాన్ని అమలు చేయడం మాత్రమే కాదు, న్యాయం, సమానత్వం, ప్రజల పట్ల కరుణతో కూడిన సేవ అందించడం. టంగుటూరి ప్రకాశం జీవితం మనకు అదే బోధిస్తుంది -- నిజం కోసం నిలబడటమే గొప్ప ధైర్యం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు శ్రీ చంద్రశేఖర్, శ్రీ సుధాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు

# వైకుంఠ ఏకాదశి శోభ

## భక్తులతో కిటకిటలాడిన విష్ణు సన్నిధి

### - ఘనంగా ఏకాదశి వేడుకలు

మనుబోలు, స్వర్ణ సాగరం:

స్థానిక విష్ణు దేవాలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా ముగిశాయి. పవిత్రమైన ఈ రోజున భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు హనుమాచార్యులు వేకువజామునే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారికి సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు.వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా స్వామివారికి పంచామృత అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం శ్రీవార్లను నూతన





వస్త్రాలు, సుగంధ భరితమైన పూలతో దివ్యసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, మంగళ హారతులు సమర్పించారు.ఈ వేడుకల్లో స్థానిక మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు తమ మొక్కులను చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు భావించారు.పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం భక్తుల కోసం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.పొట్టి హనుమంతరావు - సూర్యకుమారి దంపతులు వారి కుమారుడు కిరణ్ కుమార్, కోడలు సుకన్య ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా వ్యవహరించి తమ భక్తి చాటుకున్నారు.

# ఆయుష్‌కు భారీ ఊతం

**అమరావతి, న్యూస్:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మధ్య సమన్వయం ఆయుష్ రంగానికి భారీగా నిధులు తీసుకురావడంలో ఫలితాన్నిచ్చిందని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కేంద్రంతో సమన్వయం చేస్తూ ఆయుష్ రంగానికి నిధులు సాధించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయని తెలిపింది. 2026--27 రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళిక (సాూయాూ)కు కేంద్ర ఆయుష్ మిషన్ రూ.185.75 కోట్ల ఆమోదం తెలిపింది.జాతీయ ఆయుష్ మిషన్ ప్రారంభమైన తర్వాత రాష్ట్రానికి ఒకే ఏడాదిలో లభించిన అత్యధిక వార్షిక కేటాయింపులు ఇవేనని ప్రభుత్వం పేర్కొంది. 2014--15 నుంచి 2023--24 వరకు పదేళ్లలో రాష్ట్రానికి రూ.120.17 కోట్లు కేటాయించగా.. 2024--25 నుంచి 2026--27 వరకు మూడేళ్లలోనే రూ.434.64 కోట్లకు ఆమోదం లభించింది. గత కేటాయింపులతో పోలిస్తే ఇది నాలుగు రెట్లకు పైగా పెరుగుదల కావడం గమనార్హం.2024--25లో రూ.83.23 కోట్లు, 2025--26లో రూ.165.66 కోట్లు ఆమోదం పొందగా.. 2026--27లో ఏకంగా రూ.185.75 కోట్లకు కేంద్రం పచ్చజెండా ఊపింది. అయితే 2021--22, 2022--23, 2023--24 సంవత్సరాల్లో జాతీయ ఆయుష్ మిషన్ కింద రాష్ట్రానికి కేటాయింపులు, నిధుల విడుదల జరగలేదని ప్రభుత్వం తెలిపింది.

**గిరిజన ప్రాంతాలకు మొబైల్ వైద్యం...**గిరిజన, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ఆయుష్ వైద్య సేవలను చేరువ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. తొమ్మిది ఐటీడీఏల పరిధిలో 19 మొబైల్ మెడికల్ యూనిట్ల నిర్వహణకు రూ.1.26 కోట్లు కేటాయించారు. రంపచోడవరం, చింతూరు, పార్వతీపురం, పాడేరు తదితర ప్రాంతాల్లో ఈ బృందాలు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాయి.

**601 డిస్పెన్సరీలకు డిజిటల్ సేవలు...**ఆయుష్ వైద్యాన్ని డిజిటల్ విధానంలోకి తీసుకెళ్లేందుకు 601 డిస్పెన్సరీల్లో డిజిటలైజేషన్, ఇంటర్నెట్ సదుపాయాల కోసం రూ.50 లక్షలు కేటాయించారు. 157 మంది ఆయుష్ వైద్యాధికారులకు ల్యాప్‌టాప్‌ల కోసం రూ.62.80 లక్షలు మంజూరు చేశారు. 126 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు బీఎస్ఎన్ఎల్ ల్యాండ్లైన్, ఇంటర్నెట్ కనెక్టివిటీకి కూడా నిధులు కేటాయించారు.

**డిస్పెన్సరీల ఆధునీకీకరణ,,,**64 ప్రభుత్వ, పంచాయతీ, ప్రభుత్వ సహాయ ఆయుష్ డిస్పెన్సరీల అభివృద్ధికి రూ.12.80 కోట్లు ఆమోదించారు. ఒక్కో డిస్పెన్సరీకి రూ.20 లక్షల చొప్పున భవనాల మరమ్మతులు, ఫర్నిచర్, వైద్య పరికరాలు, ఐటీ సదుపాయాలు, ఎవీ×ూ అమలు చేయనున్నారు. రాష్ట్రంలోని 712 ఆయుష్ డిస్పెన్సరీలకు ఉచిత మందుల సరఫరా కోసం రూ.22.16 కోట్లు కేటాయించారు.

**యోగా.. డీ-అడిక్షన్ కేంద్రాలు...**ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల మానసిక, శారీరక ఆరోగ్య పరిరక్షణ కోసం సచివాలయంలో యోగా వెల్నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. నాలుగు ప్రధాన జైళ్లలోనూ ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నాలుగు ఆయుష్ బోధనాస్పత్రుల్లో ఆల్కహాల్ డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసి మద్యం వ్యసనం నుంచి బయటపడేందుకు చికిత్స అందించనున్నారు.

**క్రీడాకారులకు ప్రత్యేక వైద్యం...**కడపలో ఆయుష్ స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. సంప్రదాయ వైద్య విధానాల ద్వారా క్రీడాకారులు గాయాల నుంచి కోలుకోవడం, శారీరక సామర్థ్యాన్ని పెంచుకోవడంలో ఈ కేంద్రం ఉపయోగపడనుంది. నాలుగు ఆయుష్ బోధనాస్పత్రుల్లో పంచకర్మ, యోగా సదుపాయాలను కూడా విస్తరించనున్నారు.

**హైకోర్టులో ఆయుష్ క్లినిక్...**హైకోర్టు ప్రాంగణంలో కొత్తగా ఆయుష్ క్లినిక్ ఏర్పాటు చేయనున్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందికి ప్రాథమిక ఆయుర్వేద వైద్య సేవలు, వైద్య సలహాలు అందించేందుకు ఇది ఉపయోగపడనుంది. విజయవాడలోని డాక్టర్ ఏఎల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో అక్షి తర్పణ యూనిట్, హెర్బల్ క్వాథ థెరపీ యూనిట్‌లను ఏర్పాటు చేయనున్నారు.

**విద్యా సంస్థలకు రూ.38.84 కోట్లు...** ఆయుష్ విద్యా సంస్థల బలోపేతానికి రూ.38.84 కోట్లు కేటాయించారు. విశాఖపట్నంలోని ఎ×మీలో 100 పడకల ఆస్పత్రితో ప్రభుత్వ నేచురోపతి, యోగా కళాశాల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. కాకినాడ, ధర్మవరం, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆయుష్ కళాశాలల అభివృద్ధికి కూడా నిధులు మంజూరయ్యాయి.

**58 వెల్నెస్ కేంద్రాలకు నిధులు...**58 స్పెషాలిటీ వెల్నెస్ కేంద్రాలకు రూ.5.28 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో 55 ఆయుర్వేద పంచకర్మ, మూడు యునానీ కేంద్రాలు ఉన్నాయి. ఆరు 50 పడకల సమీకృత ఆయుష్ ఆస్పత్రులకు కొనసాగింపు బడ్జెట్ కేటాయించారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో ఈ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నారు.

**ప్రజారోగ్యానికి ప్రాధాన్యం...** పాఠశాల విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ఆయుర్విద్య కార్యక్రమానికి రూ.6.50 కోట్లు, కండరాల--ఎముకల వ్యాధుల నివారణకు రూ.2.05 కోట్లు, వయోమిత్ర కార్యక్రమానికి రూ.62 లక్షలు, సుప్రజ మాతా--శిశు ఆరోగ్య కార్యక్రమానికి రూ.8.5 లక్షలు కేటాయించారు. 126 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు రూ.5.75 కోట్లు మంజూరు చేశారు.

**కేంద్ర ఆమోదానికి కృతజ్ఞతలు: సత్యకుమార్...**ఆయుష్ వైద్య సేవల విస్తరణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన రూ.185.75 కోట్ల వార్షిక ప్రణాళికకు ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# మధుబాలగా మారేందుకు?

బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ మధుబాల బయోపిక్‌ను అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ ప్రకటించిన నాటినుంచీ.. మధుబాలగా మెప్పించే హీరోయిన్ ఎవరు? అనే ప్రశ్న బాలీవుడ్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ పాత్రలో ఫలానా హీరోయిన్ నటించనున్నదంటూ పలు హీరోయిన్ల పేర్లు కూడా వినిపించాయి. అయితే.. చివరకు మధుబాల పాత్రకు 'దురంధర్' బ్యూటీ సారా అర్జున్‌ని ఎంపిక చేసినట్టు సమాచారం. నటన, హావభావాలు, డ్యాన్స్ మూమెంట్స్, శరీరక భాష.. ఇలా అన్ని విషయాల్లోనూ మధుబాలను తలపించేందుకు సారా కఠినంగా శ్రమిస్తున్నట్టు బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటున్నదట. సంజయ్‌లీలా భన్సాలీ సినిమాలు ఎంత గ్రాండియర్‌గా ఉంటాయో తెలిసిందే. ఈ చిత్రాన్ని ఆయన నిర్మిస్తుండగా, జస్మీత్ కె.రీన్ దర్శకత్వం వహిస్తున్నారు.






# ఇంటర్వెల్ బ్యాంగ్ భాగ్యనగరంలో?

'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్. తన గత చిత్రాలకు భిన్నంగా, వైవిధ్యమైన కథ, కథనాలతో అత్యంత భారీగా దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలే ఉన్నాయి. మాఫియా నేపథ్యంలో ఓ డాన్ చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుందని సమాచారం. సైన్స్ ఫిక్షన్ అంశాలు కూడా ఈ కథలో ఉన్నట్టు వినికిడి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతున్నది. ఈ షెడ్యూల్ అనంతరం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో మరో షెడ్యూల్‌ని దర్శకుడు అట్లీ ప్లాన్ చేశారు. దీనికోసం ఓ భారీ సెట్‌ని కూడా నిర్మిస్తున్నారు. ఈ సెట్‌లోనే ఇంటర్వెల్ బ్యాంగ్‌ని చిత్రీకరిస్తారట. అలాగే, కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా తీస్తారని తెలిసింది. దీపిక పదుకోన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మృణాళ్‌ఠాకూర్, జాన్వీ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ పాన్‌ఇండియా సినిమాను నిర్మిస్తున్నది.



# స్వరాన్వేషణలో... 50 భాషల్లో 'వారణాసి' విడుదల

తెరపై కనిపించే తారలు వేరు... వాళ్లు పలికే సంభాషణలు పలికేవాళ్లు వేరు. మరి... తెరపై కనిపించే వ్యక్తి హావభావాలకు తగ్గట్టుగా సంభాషణలు పలికే వ్యక్తి కంఠస్వరం ఉండాలి కదా. ప్రస్తుతం రాజమౌళి అలా మ్యాచ్ అయ్యే 'వాయిస్'ల కోసం అన్వేషిస్తున్నారని సమాచారం. మహేశ్‌బాబు హీరోగా తాను తెరకెక్కిస్తున్న 'వారణాసి' కోసమే రాజమౌళి దాదాపు పదిహేను వందల మంది వాయిస్ ఆర్టిస్ట్‌లను పరిశీలించి, మ్యాచ్ అయ్యేవారితో డబ్బింగ్ చెప్పించాలని అనుకుంటున్నారట. ఇంతకీ 1500 మంది ఆర్టిస్ట్‌లు ఎందుకు అంటే... 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 50 భాషల్లో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారని టాక్. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మిగతా భాషల్లోనూ అనువదించి, విడుదల చేస్తారు. సో... పాత్రలకు సరిగ్గా సరి పోయే గొంతులను ఎంపిక చేసి, ఆయా భాషల్లో డబ్బింగ్ చెప్పించాలనుకుంటున్నారట. ఇన్ని వాయిస్‌లంటే ఏఐ ద్వారా కూడా చేయొచ్చు. కానీ, భావోద్వేగాలు సహజంగా ఉండాలంటే మనుషులతోనే మాట్లాడించాలనుకుంటున్నారట. అందుకే 'రియల్ వాయిస్'లను ఎంపిక చేయాలనుకుంటున్నారని భోగట్టా. రాజమౌళి టీమ్ ప్రస్తుతం ఈ ఆడిషన్స్ చేసే పని మీద ఉందని తెలిసింది. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా మొత్తం 120 దేశాల్లో 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది.

Edited Printed Published & Owned by Embeti Kameswari. And Printed at VSR Publishers and Printers, #1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. Published at VSR Publications, 1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR Embeti Kameswari, PRGI. NO. APTEL/26/A2367